# నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

## క్లుప్తంగా

### ప్రమాణస్వీకారానికి తరలిన ఉద్యోగులు

**సత్తెనపల్లి:** ఏపీఎన్‌జీజీటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అలపర్తి విద్యాసాగర్ ప్రమాణస్వీకారం మంగళవారం విజయవాడలో జరగనున్న నేపథ్యంలో నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ ఆధ్వర్యంలో ఉద్యోగులు తరలి వెళ్ళారు. కార్యక్రమంలో సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణి రావు, సెక్రటరీ ఎస్. అంబేడ్కర్, ట్రజరర్ కోటేశ్వరరావు, తదితర యూనియన్ బాధ్యులు, ఉద్యోగులు ఉన్నారు.

### బాబూరావు అరెస్ట్ హేయం

**సత్తెనపల్లి:** బీఎస్పీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బూదాల బాబురావు అక్రమ అరెస్ట్ హేయమైన చర్య అని బహుజన సమాజ్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరుపోగు నవీన్ బాబు ఖండించారు. యడ్లపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన నేపథ్యంలో దళితుల భూ వివాదంపై ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతి కోసం వెళ్లి వస్తుండగా మంగళవారం రొంపిచర్ల పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని వెల్లడించారు. ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసేందుకు అనుమతి అడగడం కూడా నేరమా అని ప్రశ్నించారు. బాబురావును పోలీసులు వెంటనే విడుదల చేయాలని, లేకుంటే జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

**సత్తెనపల్లి:** పీడబ్ల్యూడీ వర్క్‌షాప్స్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయుసీ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని నాగార్జునసాగర్ కెనాల్స్ డివిజన్ ఆఫీస్‌లోని సమావేశ మందిరంలో యూనియన్ క్యాలెండర్‌ను ఎస్.ఎస్.జె.సి. సత్తెనపల్లి డివిజన్ మేనేజర్ వి.వి.సుబ్బారెడ్డి, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ సత్తెనపల్లి తాలూకా ఉపాధ్యక్షుడు బత్తుల అరుణ్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వి దుర్గేష్, డి సుందర్ రావు, యూనియన్ సత్తెనపల్లి డివిజన్ గౌరవాధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్టీయూ కాలెండర్ ఆవిష్కరణ..**

**క్రోసూరు:** రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయు) నేతలు నూతన సంవత్సర కాలెండర్, నూతన సంవత్సర స్టిక్కర్స్, పాకెట్ డైరీలు, 10వ తరగతి విద్యార్థుల స్టడీ మెటీరియల్స్ ఆవిష్కరించారు. మంగళవారం మండల రిసోర్సు కార్యాలయంలో ఎంఈఓ-1 వై.ప్రసాదరావు, ఎంఈఓ-2 ఎం.గణేష్ సమక్షంలో ఆవిష్కరించారు. ఎస్టీయు మండల అధ్యక్షుడు ఎంవి రవికాంత్ రెడ్డి, సీపీఎస్ కన్వీనర్ పి.ఆంటోనీ, ఎస్టీయు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సాతులూరి రాఘవ, జిల్లా కార్యదర్శి డి.వెంకటేశ్వరావు, డి.ధర్మారావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్కే షర్మిల పాల్గొన్నారు.

### నూతన సంవత్సరానికి ముస్తాబైన ఆలయం



**రాజుపాలెం:** మండలకేంద్రంలోని రాజుపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం ముస్తాబు చేశారు. జనవరి 1వ తేదీన భక్తులు అధిక సంఖ్యలో దర్శింపనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమా సుబ్బారావు తెలిపారు.

### కోటి ఆశలు..
## కొంగొత్త ఆకాంక్షలు

కోటి ఆశలతో, కొంగొత్త ఆశయాలతో ప్రజలు నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టారు. ఉత్సాహంతో 2025కు స్వాగతం పలికారు. బాణసంచా కాలుస్తూ కేకులు కట్ చేస్తూ స్వీట్లు పంచుకుంటూ హ్యాపీ న్యూఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో యువత నూతన సంవత్సర వేడుకలు మంగళవారం అర్ధరాత్రి ఘనంగా జరుపుకొన్నారు. – సత్తెనపల్లి



పట్టణంలో కేకల విక్రయానికి ఏర్పాటు చేసిన స్టాల్



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆర్‌సీఎం చర్చి

# నాడు సంక్షేమం..నేడు అధ్వానం

- సంక్షేమం ఊసెత్తని చంద్రబాబు ప్రభుత్వం
- 'సూపర్ సిక్స్' కోసం ఆశగా ఎదురు చూస్తున్న జనం
- ఆరు నెలలైనా ఎన్నికల హామీలు అమలు చేయని వైనం
- కూటమి సర్కారు తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



కంకణాలపల్లిలోని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం

**సత్తెనపల్లి:** వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లు ప్రతినెలా జరిగిన సంక్షేమ పథకాల అమలుతో పండగ చేసుకున్న ప్రజలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం షాక్‌ల మీద షాక్‌లిస్తోంది. అధికారం చేపట్టి ఆరు నెలలైనా వారిచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రచ్చబండలు, కిరాణా షాపులు, టీ దుకాణాల వద్ద ఒకటే చర్చ .. 'చంద్రబాబు ప్రభుత్వం ఇంకెప్పుడు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని? వైఎస్ జగనే సీఎంగా ఉండి ఉంటే నెలకో పథకం వచ్చేదని, పిల్లాపాపలతో అందరం పండగ బాగా చేసుకునే వాళ్లమని అనుకుంటున్నారు'. 'కూటమి ప్రభుత్వం వచ్చి పింఛన్లు నగదు మాత్రమే పంపిణీ చేస్తున్నారని, మరోవైపు చాలామంది పింఛన్లు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి, వాటిని కూడా అరకొరగానే సరఫరా చేస్తున్నారని, చాలామంది గ్యాస్ సిలిండర్లు డబ్బులు కూడా పడటం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెట్టే వారిని దూరం చేసుకుని, కొట్టేవారిని తెచ్చుకున్నామని' బాహాటంగానే విమర్శిస్తున్నారు.

**గతంలో రూ.3,057.76 కోట్లతో సంక్షేమాభివృద్ధి**

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో జగనన్న ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు రూ.3,057.76 కోట్లు సంక్షేమాభివృద్ధి జరిగింది. ఇది కేవలం ఒక్క సత్తెనపల్లి నియోజకవర్గంలో జరిగినవి మాత్రమే. ఇంతకంటే ఎక్కువగా జిల్లాలోని నరసరావుపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట, వినుకొండ, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సంక్షేమాభివృద్ధి జరిగింది. జిల్లాలోని పట్టణాలతో పాటు 28 మండలాల పరిధిలోని ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు ఉండేలా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు అందేలా అభివృద్ధి పనులు చేశారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలతో పాటు నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం, తాగునీరు, సీసీ రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం వంటివి చేపట్టారు. వీటికి తోడు ప్రతి వర్గానికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేశారు. తద్వారా ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సంక్షేమ పథకాల డబ్బులు ప్రజల చేతుల్లో ఉండబట్టే ఆర్థిక ఇబ్బందులు అంతగా అనిపించలేదన్న అభిప్రాయం ప్రజలే వ్యక్తపరుస్తుండడం విశేషం. కూటమి నేతల మాయమాటలు నమ్మి మోసపోయామని మొర్రోమంటున్నారు.

### దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు

సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు లేకపోగా.. కనీసం కూటమి ప్రభుత్వం ఇస్తానన్న పథకాలు కూడా ఇవ్వడం లేదు. దివ్యాంగులు అనే కనికరం కూడా లేకుండా రాష్ట్రంలో 3.50 లక్షల పెన్షన్‌లు తొలగించారు. జనవరి 3 నుంచి వైఎస్సార్ జిల్లాలో మళ్లీ సర్వే పేరుతో పెన్షన్‌లు తొలగించేందుకు కుట్ర చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చినమాట నిలబెట్టుకోవాలి.
–మంగళగిరి రాజశేఖర్, వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, పల్నాడు

### తల్లికి వందనం ఊసే లేదు



అధికారంలోకి వస్తే కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంత మందికి ఏటా రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తున్నా ఆ ఊసే కనపడటం లేదు. పిల్లలు చదువులకు అండగా ఉంటామని చెప్పారే తప్ప ఒక్క హామీ అమలు చేయటం లేదు. విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నా ఇంకా డబ్బులు వేయలేదు. అసలు ఇస్తారో లేదో తెలియటం లేదు.
–గంజి సుభాషిణి, దమ్మాలపాడు, ముప్పాళ్ళ మండలం

### వైభవంగా ధనుర్మాస పూజలు



వడ్డవల్లిలో స్వర్ణకవచ అలంకరణలో శ్రీవారు

**సత్తెనపల్లి:** ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వడవల్లి రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శ్రీవారికి స్వర్ణకవచ అలంకరణ చేపట్టారు. రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారికి దివ్య మంగళ స్వరూప అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

### ఎల్.వి.ప్రసాద్ వైద్యశాల వార్షికోత్సవం



**నకరికల్లు:** ప్రజల కంటిచూపును కాపాడడంలో ఎల్.వి.ప్రసాద్ వైద్య విజ్ఞానకేంద్రం నిరంతం పరిశోధనాత్మకంగా పనిచేస్తుందని ఆప్తమాలజీ టెక్నీషియన్ షేక్.సాదుల్లా తెలిపారు. నకరికల్లులోని ఎల్.వి.ప్రసాద్ కంటివైద్య కేంద్రం 8వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వైద్యశాల కో-ఆర్డినేటర్ మల్లేష్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, అశోక్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పొన్నూరు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లిలో న్యాయవాదుల నిరసన



**సత్తెనపల్లి:** రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించిన పొన్నూరు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో ఉన్న నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి తాలూకా న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పొన్నూరు బార్ అసోసియేషన్‌లో సభ్యుడు, న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పొన్నూరు సీఐ పి.ఎస్.రవికుమార్, ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ గోపి, కంప్యూటర్ ఆపరేటర్ మల్లికార్జునరావులు దాడి చేసి అక్కడ ఉన్న హంటర్‌తో వీపు మీద, పాదాలపై బొబ్బలు కట్టేటట్లు కొట్టడం, చట్టాన్ని తమ చేతుల్లో తీసుకోవడమేనన్నారు. ఎస్ఐ రాజ్‌కుమార్ తదితరులు పరుష పదజాలంతో దూషించారన్నారు. న్యాయవాద వృత్తిని కూడా కించపరిచే విధంగా మాట్లాడిన పొన్నూరు పోలీసులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.న్యాయవాదులు బత్తిన శ్రీనివాసబాబు, పూజల వెంకట కోటయ్య, రాజవరపు శివనాగేశ్వరరావు, సూరే వీరయ్య, ఆదినారాయణ, కళ్ళం వీరభాస్కరరెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, రహీం, ఎమ్. ఏడుకొండల, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

### సైన్సుతోనే అభివృద్ధి సాధ్యం



సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రాజెక్టులు పరిశీలిస్తున్న విద్యార్థులు

**అమరావతి:** శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానమే మానవాళి మనుగడకు, అభివృద్ధికి మూలం అని మండల విద్యాశాఖాధికారి సిహెచ్ శివబాబు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించి మాట్లాడారు. హెచ్‌ఎం మాజేటి రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అందుకూరు ఎంపీయూపీకి ద్వితీయస్థానం..**

**క్రోసూరు:** క్రోసూరు జెడ్పీపాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్సు ఎగ్జిబిషన్‌లో మండలంలోని అందుకూరు ఎంపీయూపీ పాఠశాలకు ద్వితీయ స్థానం లభించినట్లు పాఠశాల హెచ్‌ఎం తిరుమలరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులు తయారు చేసిన విండ్ పవర్ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించిందన్నారు. ప్రాజెక్టును తయారు చేసిన విద్యార్థులు వేదులాపురపు శ్రీమణి, నల్లగొండ వివేక్ లను ఈసందర్భంగా అభినందించినట్లు తెలిపారు. సైన్సు ఉపాధ్యాయుడు ఉసిరికాయల వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్‌లో..**

**ముప్పాళ్ళ:** విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈఓ-2 ఎం.సీతారామిరెడ్డి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం జరిగింది. ప్రదర్శనను ఎంఈఓ-2 సీతారామిరెడ్డి ప్రారంభించారు. పోటీలలో మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులు, కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ముప్పాళ్ళ హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. సైన్స్ విభాగం వ్యక్తిగత ప్రదర్శనలో నార్నెపాడు, గ్రూపు ప్రదర్శనలో మాదల, పుస్తక ప్రదర్శనలో ముప్పాళ్ళ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. హెచ్‌ఎంలు కే.నాగేంద్రమ్మ, వెంకటేశ్వర్లు, మండల నోడల్ సైన్స్ టీచర్ సీహెచ్ నందగోపాల్‌రెడ్డి, సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

### మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

**వినుకొండ(నూజెండ్ల):** నూజెండ్ల జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్ పోటీలను నిర్వహించారు. సైన్స్, ఎగ్జిబిషన్ వ్యక్తిగత విభాగంలో సాయిసుమ (ఏపీ మోడల్ స్కూల్), గ్రూప్ విభాగంలో కేజీబీవీ విద్యార్థినులు జిల్లాస్థాయికి అర్హత పొందారని ఎంఈఓ ఎస్. రవిచంద్ర తెలిపారు.